క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంజాద్‌అలీ

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అంజాద్ అలీ ఆదివారం పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అంజాద్ అలీ మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తన ఎంపికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషాకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

బోర్ల ఏర్పాటు



బోరు పాయింట్ వద్ద భూమిపూజలో పాల్గొన్న ఎంఏ రషీద్, నాయకులు

ఆత్మకూరు: పట్టణ ప్రజల దాహం తీర్చేందుకు రూ.10 లక్షలతో ఏడు బోర్లను నూతనంగా వేయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎం ఏ రషీద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సిద్ధపల్లి రస్తా సమీపంలో మంచినీటి బావి వద్ద నూతన బోర్లకు భూమిపూజ చేశారు. సిద్ధపల్లి రస్తా సమీపంలో మంచినీటి బావి దగ్గర మూడు బోర్లు, వడ్ల రామాపురం రస్తాలో మంచినీటి బావి వద్ద రెండు బోర్లు, గరీబ్ నగర్ సమీపంలో మరో రెండు బోర్లు వేశామన్నారు. మొత్తం ఏడు బోర్లు వేసేలా కౌన్సిల్ ఆమోదంతో రూ.10 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.

చెట్టునీడ.. మూగజీవాలకు రక్ష



వీరాపురం గ్రామం సమీపంలో చెట్టునీడలో సేదతీరుతున్న మూగజీవాలు

కొత్తపల్లి: రోజురోజుకు ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ప్రతి రోజూ 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటోంది. అయితే పంటపొలాల వెంట మేత కోసం వెళ్లిన మూగజీవాలకు ఎండవేడిమి ప్రాణసంకటంలా మారింది. వాటి యజమానులు మధ్యాహ్నం సమయంలో ఎక్కడైనా సేద తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు. పొలాల్లో అక్కడక్కడ దూరంలో చెట్లు ఉండడంతో ఏదో ఒక దానిని చూసుకొని మేకలు, గొర్రెలు, పొటేళ్లను వాటి కిందికి చేర్చుతున్నారు. జీవాలను చెట్టునీడకు తీసుకువెళ్లి రక్షించుకుంటున్నారు.

అకాల వర్షంతో తీవ్ర నష్టం



పెనుగాలులకు లేచిపోయిన వేర్‌హౌస్ సిమెంట్ రేకులు

ఆళ్లగడ్డ: వరుస పెట్టి కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు నష్టాల పాలవుతున్నారు. చేతికొచ్చిన వరి, మిరప పంటలు ఇంటికి చేరకుండానే దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా బత్తలూరు గ్రామంలోని వెంకటసుబ్బారెడ్డికి చెందిన ఉమామహేశ్వర రూరల్ వేర్‌హౌస్ పైకప్పు రేకులు గాలివానలకు లేచిపోయాయి. దీంతో సుమారు రూ.40 లక్షల విలువ చేసే వరి, శనగ ధాన్యం తడిసిపోయాయి. దీంతో నిల్వ ఉంచుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతటి గాలులు గతంలో ఎన్నడూ లేదని..జరిగిన నష్టానికి ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కర్షకులు,బాధితులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.3 లక్షల విరాళం అందించారని ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిలో భాగంగా ముచ్చుమర్రి కాటం రఘునాథరెడ్డి, శిల్పల కుమారుడు సూర్యచంద్రారెడ్డి రూ.లక్ష, తాటిపాడు గ్రామానికి చెందిన రాయపు రామచంద్రారెడ్డి, శృతిల కుమార్తె సాన్వి రూ.లక్ష, అలాగే పారుమంచాల గ్రామానికి చెందిన మండడి సుబ్బారెడ్డి, సూర్యకళావతమ్మల కుమారుడు నరేంద్రనాథ్ రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారన్నారు.

భానుడి భగ భగలు

- 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఆందోళనలో ప్రజలు
- రాత్రివేళల్లో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- బయటకు రావడానికి జంకుతున్న జనం
- నిర్మానుష్యంగా పట్టణ రహదారులు



నిర్మానుష్యంగా మారిన ఆత్మకూరు రహదారి

ఆత్మకూరు: భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో జనం ఎండ వేడిమి తాళలేక బెంబేలెత్తుతున్నారు. పదిహేను రోజులుగా 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం ఆత్మకూరులో 44 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ ప్రతాపం చూపుతుండడంతో బయటికి రావడానికి ప్రజలు జంకుతున్నారు. దీంతో పట్టణ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..

శ్రీశైలం నియోజకవర్గంలోని శ్రీశైలం, వెలుగోడు, ఆత్మకూరు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో పదిహేను రోజులుగా ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యాయి. రాత్రి వేళ కూడా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండలు పెరిగిపోతున్నాయి



ఎండలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. బయటికి రావాలంటే భయం వేస్తుంది. ఉదయం ,సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకునేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. మృగశిర కార్తె వచ్చే వరకు ఎండలు తగ్గేలా లేవు. – వెంకటేశ్వర్లు ,ఆత్మకూరు

వడదెబ్బ తగిలే అవకాశం ఉంది

ఎండలు అధికంగా ఉండడంతో ఎండ సమయంలో బయటకు వెళ్తే వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం పూట పనులు పూర్తి చేసుకోవాలి.ఎట్టి పరిస్థితుల్లో మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు ఎండలో తిరగరాదు. ఎండవేడిమి అధికంగా ఉంది. వడదెబ్బ తగిలితే సమీపంలోని వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలి. – పవన్‌కుమార్, బైర్లూటి వైద్యాధికారి

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవం



అర్ధరాత్రి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి అమ్మవారు

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి దేవి దేవాలయంలో అమ్మవారి జ్యోతుల ఉత్సవం ఆదివారం భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముందుగా అమ్మవారిని పూల మాలలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. శనివారం రాత్రి 12 గంటల సమయం నుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతులను మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వెలసిన సోమేశ్వర స్వామి ఆలయం నుంచి గ్రామ నలుమూలల గ్రామ పురోహితులు యాదవేని లక్ష్మీ నరసయ్య శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చౌడేశ్వరిదేవి అమ్మవారికి జ్యోతుల సమర్పించడంతో కార్యక్రమం ముగిసింది. అమ్మవారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసుకున్నారు.

మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా నరాల మౌళీశ్వరరెడ్డి !

- నిరాశలో ఆశావహులు

మహానంది: మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా మసీదుపురం గ్రామానికి చెందిన నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి పేరును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఖరారు చేసినట్లు టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. దీంతో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పోటీ పడిన, పదవిని ఆశించిన పలువురు నేతలు నిరాశకు లోనయ్యారు. మసీదుపురం, తమ్మడపల్లె, గాజులపల్లె, తిమ్మాపురం గ్రామాలకు చెందిన పలువురు చైర్మన్ పదవిని ఆశించారు. అయితే మౌళీశ్వరరెడ్డి పేరే ప్రధానంగా వినిపిస్తూ వచ్చింది. దీంతో స్వయంగా ఎమ్మెల్యేనే పేరు ప్రకటించడంతో ఆశిస్తున్న వారి ఆశలకు బ్రేక్ పడింది. మండలంలో కొందరికి, నంద్యాల పట్టణంలో ఒకరికి, వెలుగోడు, బండిఆత్మకూరు, ఆత్మకూరు మండలాల నుంచి ఇద్దరికి ధర్మకర్తలుగా ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మహానంది ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎంపిక విషయంలో ఎప్పుడూ కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెడుతూ వస్తున్నారని, మిగిలిన ఓసీల్లో, బీసీల్లో ముఖ్యమైన నేతలు లేరా, ఆ వర్గాల వారు పార్టీకి చేస్తున్నవి సేవలు కావా అంటూ పలు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తులతో మహానంది కిటకిట



రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరులు భక్తులతో నిండిపోయాయి. పుణ్యస్నానాల అనంతరం భక్తులు ఉచిత, శీఘ్ర దర్శనం, అభిషేకం, స్పర్శ దర్శనం ఆర్జిత సేవా టికెట్ల ద్వారా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండ రామాలయం, వినాయకనంది, గరుడనంది క్షేత్రాలను సందర్శించి నందివిగ్రహం వద్ద చెట్ల కింద సేదతీరారు.

ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలి

మహానంది: రౌడీ షీటర్లు ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని వివిధ కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడటం, రెచ్చగొట్టేలా ప్రవర్తించడం చేస్తే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్‌ఐ మౌలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో 8 రోజుల పాటు నిర్వహించే ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5 న వానాల, 6 న మద్దూరు,7 న మిట్టకందాల, 8 న పాములపాడు, అలాగే 12న జూటూరు-2, 13న జూటూరు- 1, 14న పాములపాడు- 2,15న ఎర్రగుడూరు గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా

బనగానపల్లె రూరల్: పట్టణంలోని బేతంచర్ల మార్గంలో ఆదివారం తెల్లవారుజామున సిమెంట్ లోడుతో వెళ్తున్న ఐచర్ లారీ బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు.. దాల్మియా సిమెంట్ లోడుతో కర్నూలు వైపు ఐచర్ లారీ వెళుతోంది. బనగానపల్లె ఎండీహెచ్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫోర్‌లైన్ డివైడర్‌ను వేగంగా ఢీకొని బోల్తాపడింది. సిమెంట్ బస్తాలన్నీ రోడ్డుపై పడ్డాయి. అయితే ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ నూర్ అహ్మద్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. లారీ రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీఐ ప్రవీణ్‌కుమార్ జేసీబీతో వాహనాన్ని పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో కూడా ఈ ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయని.. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1992–93 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా సాగింది. సమావేశానికి హాజరైన ఆనాటి ఉపాధ్యాయులను మేళతాళాలతో ఆహ్వానం పలికారు. ఆనాటి తరగతి గదుల్లో చోటుచేసుకున్న ఘటనలు జ్ఞాపకం చేసుకుంటూ మధురంగా గడిపారు. రూ. 80 వేలతో పాఠశాల ఆవరణలో స్టేజీ నిర్మాణం చేపట్టి పాఠశాలపై తమకున్న మమకారాన్ని చాటుకున్నారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి గురు భక్తిని ప్రదర్శించారు. వెంకటాద్రినాయుడు, జలీల్, శేషన్న, శ్రీను, ఆవుల నాగేష్, సావిత్రి, అరుణ, నాగలక్ష్మి, లలితదేవి, రుక్మిణి, చంద్రశేఖర్, ఎల్లయ్య, నాగలక్ష్మయ్యలు పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి విశేషంగా కృషి చేశారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

జూపాడుబంగ్లా: సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. ఆదివారం రాత్రి మండలకేంద్రమైన జూపాడుబంగ్లా సంతగేటు ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌చేసి ఆధార్, బ్యాంకు, పాన్ నంబర్లు అడిగితే ఇవ్వొద్దన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికే వారిని నమ్మి వారిచేతుల్లో డబ్బులు పెట్టి మోసపోవద్దన్నారు. రూ.50వేలు, రూ.లక్ష పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలో అంతకు రెండింతల డబ్బులిస్తామని చెప్పేమోసగాళ్ల మాటలు నమ్మవద్దని సూచించారు. గ్రామాల్లో ఏదేనా సమస్య వస్తే వెంటనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆవేశానికి లోనై తొందరపడి ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ లక్ష్మినారాయణ, ఏఎస్‌ఐ సంజీవయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో జిల్లా ఎడ్ల ప్రతిభ



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మేళతాళాలతో, శాలువ, పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. నంద్యాల జిల్లా సంజామాల మండలం ఆకుమళ్లకు చెందిన కాకర్ల నాగజ్యోతి ఎడ్లు 4,444 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా కోసూరు మండలం బయ్యవరానికి చెందిన కడియం మణికంఠ ఎడ్లు 3,918 అడుగులు, నంద్యాల జిల్లా రోళ్లపాడుకు చెందిన డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎడ్లు 3,750 అడుగులు, గిద్దలూరు మండలం ముళ్లపాడుకు చెందిన కంచర్ల తనీస్ ఎడ్లు 3750 అడుగులు, కంభం మండలం ఎర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలతానాయుడు ఎడ్లు 3328 అడుగులు దూరం లాగి రెండు, మూడు, నాలుగో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.12,500, రూ.12,500, రూ.5 వేల నగదు బహుమతులను దప్పిలి బ్రదర్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ కన్వీనర్ మల్లెల శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దప్పిలి రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ బుగ్గారెడ్డి, నాయకులు రామిరెడ్డి, సిద్దారెడ్డి, కాశిరెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న నరసింహ నాయక్

ఆత్మకూరు: మే డే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న కార్మిక, కర్షక చట్టాలను కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహ నాయక్, జిల్లా నాయకులు ఎ.రణధీర్, మండల నాయకులు చందావారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మే డే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కొత్త రామాపురం గ్రామంలో సీపీఎం గ్రామ కార్యదర్శి పక్కీరయ్య జెండాను ఆవిష్కరించారు. సీపీఎం గ్రామ నాయకులు జయపాల్, యోహాన్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, శేఖర్‌నాయక్, కరుణమ్మ, శ్రీకాంత్, అబ్రహం, సత్య, శివుడు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో ఉద్యమించాలి..

ఆత్మకూరు: కార్మికుల, కర్షకుల హక్కుల కోసం మే డే స్ఫూర్తితో ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ అన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ట్యాక్సీ ఆటో వర్కర్స్ యూనియన్, టౌన్ ఆటో సర్వీసు యూనియన్ల ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను యేసురత్నం జెండాను ఆవిష్కరించారు. భాస్కర్, మాబాషా, సద్దాం, మన్సూర్, శ్రీను పాల్గొన్నారు.

కుళాయిలకు కలుషిత నీరు

- ఇబ్బందులు పడుతున్న భానుముక్కల గ్రామస్తులు
- నెల రోజులుగా రంగుమారిన నీరు
- రోగాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



గ్రామానికి సరఫరా అయ్యే కలుషిత నీటిని బాటిల్స్, బకెట్‌లలో పట్టిన దృశ్యం

పాములపాడు: మండలంలోని భానుముక్కల గ్రామానికి వెలుగోడు రిజర్వాయర్ నుంచి కలుషిత నీటిని సరఫరా చేస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటి వలన అనారోగ్యాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెల రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా పంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచ్ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజలకు రక్షిత మంచినీరు ఎండమావిగా మారిందని, కలుషిత నీరు తాగడం వలన ఎక్కడ అతిసారం గ్రామాన్ని కబళిస్తోందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున తాగునీటి అవసరాలు కూడా రెండింతలు పెరిగిపోయాయని చెబుతున్నారు. పశువులు కూడా తాగడానికి పనికిరాని నీటిని ప్రజలు తాగేందుకు రిజర్వాయర్ నుంచి సరఫరా చేసి తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి భానుముక్కల గ్రామానికి కలుషిత నీరు కాకుండా స్వచ్ఛమైన రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

చల్లని ఉపశమనం

- ఎయిర్ కూలర్లతో ఉక్కపోత, వేడి నుంచి ఉపశమనం
- ఎక్కువగా కొనుగోలు చేస్తున్న మధ్య తరగతి కుటుంబాలు
- అందుబాటులో వివిధ రకాల మోడళ్లు

నందికొట్కూరు: ఎండలు తీవ్రంగా ఉండటంతో బయటకు వెళ్లేందుకు దాదాపు ఎవరూ సాహసించట్లేదు. మరి ఇంట్లో ఉంటే ఓకేనా అంటే.. లేదు లేదు.. ఇంట్లో కూడా భరించలేని వేడి, ఉక్కపోత. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు పట్టణవాసులు ఎయిర్ కూలర్‌లను ఆశ్రయిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలను వేడి సెగ, ఎండ దెబ్బ నుంచి రక్షించి ఈ కూలర్లు కొంచెం కూల్ చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్ తిరిగినా వేడిగాలితో ఉండలేని పరిస్థితి. ఏసీలు కొనే స్థోమత లేని మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు కూలర్ల వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. నెల రోజులుగా కూలర్లు విపరీతంగా అమ్ముడుపోతున్నాయి. కొత్త కూలర్ల కొనుగోలుతో పాటు, పాత వాటిని మరమ్మతులు చేయిస్తున్నారు.

వేడి నుంచి ఉపశమనం..

వివిధ రకాల కూలర్లు చల్లటి గాలినిస్తూ ఎండలో అలిసిపోయి వచ్చిన వారిని సేదతీరుస్తున్నాయి. సామాన్యులకు కూడా అందుబాటులో ఉన్న ఈ కూలర్ల సహాయంతోనే వేసవిని ఎదుర్కొంటున్నారు ప్రజలు. కూలర్లను ఇంటి బయట కిటికిలో అమరిస్తే చల్లటి గాలినిస్తూ ఏసీలను మరిపిస్తున్నాయి. కరెంట్ బిల్లు కూడా ఏసీలతో పోలిస్తే చాలా తక్కువగా వస్తుండడంతో కూలర్ల వైపు సామాన్యులు మొగ్గు చూపుతున్నారు.

రకరకాల మోడల్స్..

పలు రకాల గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన కూలర్లు పట్టణంలో వినియోగదారులకు అందుబాటులోకి ఉన్నాయి. పట్టణంలో వివిధ కంపెనీలకు చెందిన పలు మోడల్స్‌తో పాటు లోకల్ మేడ్ కూలర్లు కూడా దుకాణాల్లో లభిస్తున్నాయి. రూ. 4 వేల నుంచి రూ.12 వేల వరకూ ధరలు పలుకుతున్నాయి. అమ్మకందారులు ఏడాది వరకూ వారంటీ ఇస్తున్నారు.



దుకాణాల్లో విక్రయానికి ఉంచిన వివిధ రకాల కూలర్లు

ఎంత ఎండకు అంత గిరాకీ



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువ పెరగడంతో ప్రజలు ఇళ్లల్లో, దుకాణాల్లో ఎండ వేడి, ఉక్కపోత నుంచి రక్షణ పొందేందుకు కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నెల నుంచి కూలర్ల అమ్మకాలు జోరుందుకున్నాయి. కంపెనీలకు చెందిన కూలర్లకు ధరలు అధికంగా ఉండడంతో సామాన్య ప్రజలు లోకల్ మేడ్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. – లక్ష్మినారాయణగౌడ్ , వ్యాపారి

ఉక్కపోతను తట్టుకోలేక



మే నెల 41 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత ఎక్కువగా వుంది. ఇంట్లో ఉండలేకపోతున్నాం. బయట వేడి గాలులు వీస్తుండడంతో ఇంట్లో ఫ్యాన్ కింద వేడిగా ఉండి తట్టుకోలేకపోతున్నాం. ఉక్కపోత నుంచి రక్షణ పొందేందుకు కూలర్‌ను కొనుగోలు చేశా. కూలర్ కొంత మేరకు చల్లని గాలినిపస్తుంది. – రమణయ్య, పట్టణం